
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 2 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:25 ఆదివారం
సహర్ 5:13 సోమవారం

సదరం సర్టిఫికెట్‌ను పోర్టల్‌లో నమోదు చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ కలిగియున్న దివ్యాంగులకు యూడీఐడీ నంబరు జనరేట్ చేసి పోర్టల్‌లో నమోదు చేయాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరం సర్టిఫికేట్ విధానానికి స్వస్తి పలికి, నూతనంగా యూడీఐడీ కార్డుల జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. దివ్యాంగులకు సంబంధించిన ఇతర వివరాలను సంపూర్ణంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్‌తో పాటు డీఆర్‌డీఓ రఘువరన్, మెడికల్ కళాశాల ఆర్‌ఎంవో సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా


చిట్టాపూర్‌లో ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

మల్లాపూర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి):వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ శాలియానాయక్ అన్నారు. శనివారం మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌ను స్థానిక అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రూ.4.25 కోట్లతో పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టామన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి ట్రాన్స్‌కో అధికారులకు సహకరించాలన్నారు. సిబ్బంది గ్రామంలో పర్యటిస్తూ విద్యుత్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈలు గంగారాం, రవీందర్, ఏడీఈ మనోహర్, ఏఈలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 900 మెట్రిక్ టన్నుల యూరియా

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు సింగిల్‌విండో కార్యాలయాలకు శనివారం 900 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకుంది. కొన్ని రోజులుగా యూరియా కొరతతో రైతులు అవస్థలు పడుతున్న నేపథ్యంలో అదికారులు స్పందించి యూరియాను పలు ప్రాంతాల నుంచి తెప్పించారు. జిల్లాకు వచ్చిన యూరియాను నిర్ణీత కేటాయింపుల ప్రకారం ఆయా సింగిల్ విండో గోదాములకు తరలించారు.

యూరియా కొరత రానివ్వం

-జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలో యూరియా కొరత రానివ్వకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాకు తాజాగా సుమారు 900 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గల సింగిల్ విండో కార్యాలయాలకు అవసరమైన యూరియాను సరఫరా చేశామన్నారు. అవసరమైన పక్షంలో మరిన్ని మెట్రిక్ టన్నుల యూరియా తెప్పించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతుల డిమాండ్ మేరకు యూరియాను సరఫరా చేస్తామన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఎండపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమని ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గ్రామంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మార్కండేయ ఆలయంలో కెమెరాలను ప్రారంభించామన్నారు.గ్రామాన్ని సురక్షితంగా ఉంచడానికి సీసీ కెమెరాలు పని చేస్తాయన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని నేరాలను అరికట్ట డానికి పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమా సాగర్, ఆదిల్, ఆలయ చైర్మన్ పురుషోత్తం పాల్గొన్నారు.

ర్యాంకు దక్కేనా..?


మెట్‌పల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్న మెప్మా సిబ్బంది



- జిల్లాలో ప్రారంభమైన స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు
- పనితీరు ఆధారంగా మున్సిపాలిటీల్లో మార్కుల కేటాయింపు
- చురుగ్గా సాగుతున్న ప్రజాభిప్రాయ సేకరణ
- ఈనెల 31 వరకు గడువు
- ఏప్రిల్‌లో ర్యాంకులు ప్రకటించనున్న కేంద్రం

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడానికి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు కసరత్తు చేస్తున్నాయి. ఒక్క అడుగు స్వచ్ఛత వైపు అన్న నినాదంతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీల్లో తడి, పొడి చెత్తను విడిగా సేకరించడం, యంత్రాల నిర్వహణ, డంపు యార్డులు, మానవ వ్యర్థాల నిర్వహణ, జియో ట్యాగింగ్, పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ, ప్లాస్టిక్ వాడకం నిషేధం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. కేంద్ర బృందం మున్సిపాలిటీల్లో పర్యటించి పరిశుభ్రత ప్రమాణాలు తనిఖీ చేసి ర్యాంకులు నిర్ధారిస్తుంది. ప్రజల అభిప్రాయం, పౌరులకు అందుతున్న సేవలు, సర్టిఫికేషన్ వంటి విభాగాల్లో సాధించిన ప్రమాణాలను అనుసరించి మార్కులు కేటాయిస్తారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో అందిస్తున్న సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో ప్రస్తుతం ప్రారంభమైన అభిప్రాయ సేకరణ ఈనెల 31వ తేదీ వరకు కొనసాగనుంది.

పోర్టల్‌లో వివరాలు నమోదు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కొన్ని నిబంధనలు ఇటీవల కొత్తగా చేర్చారు. స్వచ్ఛ కార్యక్రమాల అమలు గురించి పోటీల్లో పాల్గొనే స్థానిక సంస్థలు నిర్ణీత వ్యవధుల్లో సంబంధిత 'స్వచ్ఛతమ్' పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తాయి. పోర్టల్‌లో పొందుపరిచిన వివరాలు నిజంగా అమలు అవుతున్నదీ, లేనిదీ పరిశీలించేందుకు కేంద్రం నుంచి వచ్చే బృందాలు తనిఖీలు చేస్తాయి. పరిశీలనల్లో తప్పుడు వివరాలు నమోదైనట్లు గుర్తిస్తే పెనాల్టీ విధించి మైనస్ మార్కులు వేస్తాయి. రెడ్యూస్,

మిగతా 8వ పేజీలో

సర్వే కోసం యాప్

సర్వే నిర్వహించేందుకు వీలుగా యాప్‌ను ఏర్పాటు చేశారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సర్వేకు సంబంధించిన ఫారం, ఓటీపీ వస్తుంది. ఆయా మున్సిపాలిటీల్లో స్వచ్ఛత సాధించడంలో పురోగతిపై పది ప్రశ్నలు ఉంటాయి. ప్రతి రోజు చెత్త సేకరించేందుకు మీ ఇంటికి లేదా దుకాణాలకు మున్సిపల్ సిబ్బంది వస్తారా..? ఇంట్లోని చెత్తను తడి, పొడిగా వేరు చేసి ఇస్తున్నారా..? మీ ప్రాంతంలోని పబ్లిక్ టాయిలెట్స్ యొక్క శుభ్రత, వాటి నిర్వహణపై మీరు ఎంత వరకు సంతృప్తి చెందారు..? తదితర ప్రశ్నలు ఉంటాయి. వాటిలో ఒకదానిని ఎంచుకొని ఓటీపీ జత చేసి పంపాల్సి ఉంటుంది. మెప్మా సిబ్బంది పట్టణాల్లో తిరుగుతూ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ యాప్‌లో నమోదు చేస్తున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, రాష్ట్ర పురపాలక శాఖ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ఇటీవల స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించిన టూల్ కిట్‌ను విడుదల చేశారు. దీని ఆధారంగా సర్వే చేపట్టనున్నారు.

మార్కుల కేటాయింపులు ఇలా...

ఓడీఎఫ్, తాగునీరు:	1,200 మార్కులు
గార్బేజ్ ఫ్రీ సిటీ:	1,300 మార్కులు
మిగిలిన అంశాలకు:	10,000 మార్కులు
మొత్తం:	12,500 మార్కులు



జగిత్యాలలో మెప్మా సిబ్బంది ప్రజాభిప్రాయ సేకరణ


కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

మూడు షిఫ్టుల్లో
ఓట్ల లెక్కింపు

- జంబో బ్యాలెట్‌తో జాప్యం జరిగే అవకాశం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు
- ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 14 టేబుళ్లు

6

వర్మీ కంపోస్టు తయారీపై
అవగాహన ఉండాలి
-రాష్ట్ర అధికారి హేమలత

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

8

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నాగేందర్

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో ముందు వరుసలో నిలపాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డీఈవో రామును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విద్యాశాఖ సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌రెడ్డికి సంబంధించిన పెన్షన్ ప్రయోజనాలు వీలైనంత త్వరగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి అమరేందర్ రెడ్డి, నాయకులు రాజేశం, సుగుణాకర్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి


కథలాపూర్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రాము

ఇబ్రహీంపట్నం, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను, మోడల్ స్కూల్‌లలో నిర్వహించే పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శిం చారు. పరీక్ష కేంద్రాలలో కల్పించాల్సిన సౌకర్యాలు, తదితర వాటిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పరీక్షలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మండల విద్యాధికారి మధు, తదితరులు ఉన్నారు.

●కథలాపూర్, ఆంధ్రజ్యోతి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం జిల్లా విద్యాధికారి రాము పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతరత్రా ఫర్నిచర్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఎంఈఓకు సూచించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఇటీవల ప్రధానమంత్రి నుంచి ప్రశంసాపత్రం అందుకున్నందుకు గాను సన్మానించారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా చూడాలని అన్నారు. వెనకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లోకిని శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేటి నుంచి రంజాన్ దీక్షలు ప్రారంభం

జగిత్యాల అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రంజాన్ దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం నెల వంక కనిపించడంతో ఆదివారం నుంచి ముస్లింల పవిత్ర మాసం రంజాన్ ప్రారంభం అవుతున్నది. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లాలో ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రార్థన స్థలాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అధికారులను ఆదేశించారు.

గ్రానైట్ అక్రమ రవాణా చేస్తే చర్యలు

జిల్లా మైనింగ్ శాఖ ఏడీ జైసింగ్

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కంకర, క్రషర్ స్టోన్‌తో పాటు గ్రానైట్‌ను అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ శాఖ ఏడీ జైసింగ్ అన్నారు. స్టేట్ మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ శ్రీధర్ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయ సముదాయ భవనంలో గల జిల్లా మైనింగ్ శాఖ కార్యాలయంలో జిల్లాలోని క్రషర్ స్టోన్, కంకరతో పాటు గ్రానైట్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ జైసింగ్ మాట్లాడుతూ గ్రానైట్, కంకర, క్రషర్ స్టోన్ రవాణాకు ఖచ్చితంగా బిల్లులు ఉండాలన్నారు. బిల్లులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తే శాఖపరంగా చర్యలు తప్పవన్నారు. పారదర్శక విధానంలో నిబంధనలకు లోబడి రవాణా కొనసాగేందుకు యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యాలయ సిబ్బందితో పాటు యాజమాన్యాలు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం పడిగాపులు'

జగిత్యాల అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ కార్డుల కోసం సీనియర్ సిటిజన్లు పడిగాపులు కాస్తున్నారని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో పలువురు సీనియర్ సిటిజన్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏబిహెచ్‌ఏ కార్డులు నెల రోజులుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్‌ల ఆధ్వర్యంలో ముద్రించిన 'సీనియర్ సిటిజన్‌ల ఆరోగ్య సలహాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య బీమా పథకంలో 37 అక్షలకు పైగా అర్హులని రాష్ట్రంలో 14 వేల మంది వరకు నమోదు చేసుకున్నారని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి ఏబిహెచ్ కార్డులు అనుసంధానం చేస్తేనే కార్డులు డౌన్‌లోడ్ అయి వైద్య సేవలు అందుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్ రావు, బొల్లం విజయ్, హన్మంత రెడ్డి, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు'

కథలాపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లలో ఈనెల 5 నుంచి జరగబోయే ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అచ్యుత్‌రాజ్ తెలిపారు. మోడల్‌స్కూల్‌కు చెందిన ఫస్టియర్ విద్యార్థులు 117 మంది, సెకండియర్ 129 మంది విద్యార్థులు, జూనియర్ కళాశాలకు సంబంధించి ఫస్టియర్ 135 మంది, సెకండియర్ 168 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు పరీక్షా కేంద్రంలో అన్ని రకాల వసతులు విద్యార్థులకు కల్పించినట్టు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

●ముఖ్యమంత్రికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ వినతి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గ పరిధిలో గల గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వినతి పత్రాన్ని సమర్పిం చారు. హైదరాబాద్‌లో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టుతున్నామని, వెంటనే నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో సీఎం సానుకూలంగా స్పందించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు 55 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసి సంతోషంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర చరిత్రలో అత్యధికంగా విద్యుత్ వినియోగం జరుగుతుందని ఆయన అన్నారు. చరిత్రలో 16 వేల అత్యధిక మెగావాట్లకు విద్యుత్ డిమాండ్‌కు చేరుకుందని ఆయన తెలిపారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ 17,500 మెగావాట్లకు చేరుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసుకుందని ఆయన పేర్కొన్నారు. కరెంట్ కోతలతో రాష్ట్రంలో ఎక్కడ ఒక్క అంగుళం భూమి కూడా ఎండిపోలేదని ఆయన తెలిపారు. ఎండల వల్ల అక్కడక్కడ పంటలు ఎండిపోతున్నాయని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వం పైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయని, కరువు వచ్చిందని శాడిస్టుల్లా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. పంటలు ఎండిపోవాలని, కరెంట్ కోతలు పెట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. యూరియా కొరత లేదని అన్నారు. ప్రతి రైతుకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల తప్పుడు ప్రచారంతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రైతులను కళ్లలో పెట్టుకుని చూసుకునే ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. రైతులకు 23 వేల కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర అంటూ ఆయన పేర్కొన్నారు. రైతు భరోసా ఎకరానికి 12 వేలకు పెంచామని, వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ 500 బోనస్ ఇస్తున్నామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ఎత్తి వేసిన వ్యవసాయ పనిముట్ల సబ్సిడీలనే తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆయన అన్నారు. రైతులకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకునే బాధ్యత తమపై ఉందని లక్ష్మణ్‌కుమార్ ఈసందర్భంగా తెలిపారు.

విద్యార్థినుల క్షేత్ర పర్యటన

జగిత్యాల రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు క్షేత్ర పర్యటనలో భాగంగా జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పౌలస్తేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా దేవా లయానికి సంబంధించిన చారిత్రక, పౌరాణిక ప్రాశస్త్యాన్ని గూర్చి దేవాలయ వ్యవస్థాపక నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రామ కృష్ణ మాట్లాడుతూ క్షేత్రపర్యటనల ద్వారా విజ్ఞానం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నీరజ, లక్ష్మణ్, ప్రమోద్‌కుమార్, శ్రీలత మల్లిఖార్జున్, సునీత, వెంకటసాయి, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తెస్తాం

కొడిమ్యాల, మార్చి1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్ కార్య కర్తలను కోరారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుల స్వామి, ఆనందం, రాజేశం, లక్ష్మారెడ్డి, రమేష్, రాజు పాల్గొన్నారు.

మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు

- జంబో బ్యాలెట్‌తో జాప్యం జరిగే అవకాశం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు
- ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 14 టేబుళ్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన కరీంగర్ అంబేద్కర్ స్టేడియంలోనే ఈ నెల 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 2,50,328 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజక వర్గం లో 24,968 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల నియోజక వర్గంలో 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండ డంతో జంబో బ్యాలెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఓట్ల లెక్కింపులో జాప్యం జరిగే అవకాశం ఉంది. కనీసం రెండు రోజులు ఓట్ల లెక్కి ంపు కొనసాగే అవ కాశం ఉండడంతో మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.



● పకడ్బందీ ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు పోలీసులు అంబేద్కర్ స్టేడి యం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పూర్తి చేసింది. పట్టభద్రుల ఓట్ల లెక్కింపు కోసం 21 టేబుళ్ళ, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్ల సిద్ధం చేశారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి రెండు, మూడురోజులు పట్టే అవకాశమున్నందున మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు సిబ్బందిని నియమించారు.

● అంబేద్కర్ స్టేడియం వద్ద పటిష్ట భద్రత

ఓట్ల లెక్కింపు చేసే హాళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ స్టేడియం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 773 పోలింగ్ కేంద్రాల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను అంబేద్కర్ స్టేడియం స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి, మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను ఉంచిన గదుల ముందు మొదటి దశలో కేంద్ర బలగాలను, రెండో దశలో ఆర్మ్‌డ్ రిజర్వుడ్ బలగాలను 89 మందిని మోహరించారు. స్టేడియం చుట్టూ సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. స్టేడియం బయట ప్రధాన ద్వారా వద్ద భారీ ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పా టు చేశారు. ఈ స్క్రీన్‌పై అభ్య ర్థులు బ్యాలెట్ బాక్సుల భద్ర తను పరిశీలించే వీలు కల్పించారు. ఓట్ల లెక్కింపు వద్ద శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు 400 మంది పోలీసు సిబ్బంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు.

వివాహిత ఆత్మహత్య

- సూసైడ్ నోట్‌ను కొంగున కట్టుకుని బావిలో దూకిన యువతి
- వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ



పల్లవి (ఫైల్)

వేములవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడరూరల్ మండలం అచ్చన్నపేట గ్రామానికి చెందిన కొక్కుల దేవరాజం కుమార్తె పల్లవి(23) వివాహం వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మ్యాన శివుడు అనే యువకుడితో 2021లో జరిగింది. పెళ్లి అయిన కొద్ది రోజులకే భర్తతోపాటు అత్త విజయ, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో పలుమార్లు పంచాయతీలు జరిగాయి. అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో శనివారం తెల్లవారుజామున వేములవాడ పట్టణ శివారులోని చెక్కపల్లి రోడ్డులోగల ఓ వ్యవసాయ బావిలో దూకి పల్లవి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహానికి ఉన్న చీర కొంగుకు పల్లవి రాసిపెట్టిన సూసైడ్ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు తండ్రి దేవరాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.

మనస్థాపంతో ఒకరి బలవన్మరణం

బోయినపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కుల సంఘంలో తీసుకున్న చిట్టీ డబ్బులు సకాలం చెల్లించక మనస్థాపం చెందిన ఓవ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపినవివరాల ప్రకారం.. గ్రామానికిచెందిన పబ్బాల కొమురయ్య(55) కుల సంఘంలో 30వేల రూపాయల చిట్టీ డబ్బులు తీసుకున్నాడు. శనివారం కుల సంఘం సమావేశం ఉండడంతో తీసుకున్న డబ్బులను కొమురయ్య సకాలంలో చెల్లించే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై వ్యవసాయ పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ కిందపడి ఒకరి దుర్మరణం



ప్రశాంత్ (ఫైల్)

జమ్మికుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన బలవేణి ప్రశాంత్(32) ట్రాక్టర్ అదుపుతప్పి కెనాల్‌లో పడి శనివారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ తనసొంత ట్రాక్టర్‌పై పనుల నిమిత్తం జమ్మికుంటకు వస్తున్నాడు. మార్గమధ్యలో ధర్మారం వద్దకు రాగానే ట్రాక్టర్ కుడిటైర్ పగిలి అదుపు తప్పి కెనాల్‌లో పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం ప్రశాంత్ మీద పడటంతో అక్కడికి అక్కడే మృత్యువాతపడ్డాడు. మృతుడి భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కొత్తపల్లి చెరువులో పడి కొత్తపల్లికి చెందిన వృద్ధుడు రాపెల్లి రాజయ్య(88) మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. రాజయ్య శుక్రవారం బయటకు వెళ్లివస్తానని చెప్పి రాత్రి వరకు తిరిగి ఇంటికిరాలేదు. దీంతో ఆయన కొడుకు, బంధువులు రాజయ్య కోసం గాలిస్తూ కొత్తపల్లిలోని చెరువు వద్ద చూడగా అక్కడ అతని చెప్పులు, బట్టలు కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం గజఈతగాళలతో గాలించగా రాజయ్య మృతదేహం లభ్యమైంది. రాజయ్య బహిర్భూమికి వెళ్లి చెరువులో జారిపడి మృతి చెంది ఉంటాడని మృతుడి కొడుకు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని..
యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికిచెందిన హరీష్ అనేయువకుడు శనివారం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హరీష్ తల్లి రూ.500 వేరే వాళ్ళకి ఇచ్చి రమ్మని పంపించగా హరీష్ ఆ డబ్బులను మిత్రులతో కలసి మద్యం కోసం ఖర్చు చేశాడు. మద్యం తాగి వచ్చిన కొడుకును తల్లి మందలించింది. బయటికి వెళ్లిన హరీష్ క్రిమి సంహారక మందు తాగాడు. అనంతరం ఇంటి సమీపంలోని వారి ఇంటికివెళ్ళగా గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హరీష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ ఎక్స్‌రోడ్‌లోని వీఎస్సార్‌గార్డెన్ సమీపంలో కుక్క అడ్డు రాగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం ఆరెపల్లిగ్రామానికి చెందిన గుంటి అయిలయ్య వ్యక్తిగత పనినిమిత్తం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. మొలంగూర్ క్రాస్‌రోడ్‌లోని వీఎస్సార్‌గార్డెన్ సమీపంలో కుక్కలు పోట్లాడుకుంటున్నాయి. అయిలయ్య తన ద్విచక్ర వాహనం(టీవీఎస్ ఎక్సెల్)పై వస్తుండగా ఒకకుక్క అడ్డురాగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతోకుడిచేయి విరిగింది. గమనించిన స్థానికులు108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు యువకుడికి..

ఇల్లందకుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైస్‌మిల్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు కారు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. మండల కేంద్రానికి చెందిన శనిగరపు రాజు బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ఒకవ్యక్తి బైక్‌పై వస్తున్న రాజును గమనించక కారు ఆపి డోర్‌తీశాడు. అనంతరం బైక్ కారుడోర్‌ను ఢీకొట్టింది. దీంతో రాజు తలకు తీవ్రగాయాల య్యాయి. వెంటనే స్థానికులు రాజును జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒకటి అంకెను మూడు రకాలుగా పరిగణలోకి తీసుకోవాలి

- ఎన్నికల కమిషన్, కరీంనగర్ ఆర్‌వోకు కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రుద్ర సంతోష్ వినతి



రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రుద్ర సంతోష్

కరీంనగర్ అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి జరిగిన పోలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు విషయంలో ఒకటి అంకెను మూడురకాలుగా పరిగణించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, టీపీసీసీ నేత రుద్ర సంతోష్ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎన్నికల అధికారికి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఒకటి అంకెను మూడు రకాలుగా వేసిన విధానాన్ని వివరిస్తూ ఆయన ఒక వినతిపత్రాన్ని వారికి అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసేందుకు పట్టభద్రుల ఓటర్లు ఒకటి అంకెను మూడు రకాలుగా రాయవచ్చని. ఆ మూడు రకాల అంకెలను వివరిస్తూ, మూడు రకాలుగా ఒకటి అంకెను ఎవరు రాసినా దానిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

నేడు శ్రీపాదరావు జయంతి

- ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్‌గా సేవలు
- అధికారికంగా నిర్వహణ



మంథని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శాసనసభ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఆదివారం జరగనుంది. శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. కాటారం మండలం ధన్వాడలో కమలాబాయి- రాధాకిష్టయ్యలకు మార్చి 2, 1937లో జన్మించారు. మంథని నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి రాష్ట్ర శాసన సభా స్పీకర్ స్థానాన్ని అలంకరించారు. స్వగ్రామమైన ధన్వాడ సర్పంచ్‌గా రాజకీయ ఆరంగేటం చేసిన ఆయన మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, పొగాకు బోర్డు చైర్మన్‌గా, మంథని ఎల్ఎంబీ బ్యాంక్ చైర్మన్‌గా, డీసీసీలో, పీసీసీలో అనేక పదవులు నిర్వహించారు. 1983, 1985, 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని ఎంఎల్ఏగా గెలుపొందిన శ్రీపాదరావు ఉమ్మడి రాష్ట్ర శాసనసభా స్పీకర్‌గా నియమితులై 1994 వరకు కొనసాగారు. మంథని ప్రాంత అభివృద్ధి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. మహదేవపూర్ మండలం అన్నారం అటవీ ప్రాంతంలో శ్రీపాదరావును మావోయిస్టు 1999 ఏప్రిల్ 13న హత్య చేశారు. శ్రీపాదరావు భౌతికంగా దూరమై 24 యేళ్ల గడిచినప్పటికీ నేటికి ఇక్కడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గంలో శ్రీపాదరావు జయంతి నిర్వహణకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు సన్నాహాలు చేపట్టారు.

మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ముస్తాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఇటీవల మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిసిన క్రమంలో దొంగలుపడ్డారు. దాదాపు 8 వేల రూపాయలను హుండీలో నుంచి ఎత్తుకెళ్లినట్లు రజక సామజికవర్గం నాయకులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బీర్‌పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్(42) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్సైరవీందర్ శనివారం తెలిపారు. శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ఇంటినుంచి బయటకువెళ్లి ఇంటికి వచ్చి కింద పడిపోయాడు. తాను గడ్డిమందు తాగానని శ్రీనివాస్ కుటుంబసభ్యులకు తెలపడంతో భార్య లావణ్య ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్సఅందిస్తుండగా శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. శ్రీనివాస్‌భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అధిక వడ్డీకి అప్పు ఇస్తున్న వ్యక్తిపై కేసు

ఇల్లంతకుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన గడ్డమీది వెంకటేశంపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం వెంకటేశం గ్రామంలో అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నాడనే సమాచారం మేరకు శనివారం ఇంటిలో సోదా చేశామన్నారు. ఇంటిలో ప్రామిసరీ నోట్స్ బాండ్‌లతోపాటు విలువైనపత్రాలు లభించినట్లుతెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంటరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నంకోసం తనఅత్తింటి వారు వేధిస్తున్నారని ఓవివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఐదు గురిపై కేసు నమోదుచేశారు. పోలీసులుతెలిపిన వివరాలప్రకారం.. జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికిచెందిన ప్రనూషకు 2017లో మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌కు చెందిన వెలగందుల రాజేష్‌తో పెద్దలసమక్షంలో వివాహం జరిగింది. వివాహం జరిగిన మూడు నెలలుపాటు కలిసిమెలిసిఉన్నారు. అనంతరం రాజేష్ మరొకమహిళతో వివాహేతర సంబం ధం ఏర్పరుచుకున్నాడు. అప్పటి నుంచి తన భర్తతోపాటు అత్తవిజయలక్ష్మి, మామ సత్యనారాయణ, ఆడపడుచు అరవపల్లి లావణ్య, ఆడపడుచుభర్త కిషోర్ అదనపుకట్నం తేవాలని వేధిస్తున్నారని ప్రనూష పేర్కొంది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లుచేస్తే కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్నివిద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని ఆకళాశాలల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయాలన్నారు. అధికారుల వత్తాసు వల్లే విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి మచ్చరమేష్, నగరకార్యదర్శి మామిడిపల్లి హేమంత్, సందీప్‌రెడ్డి, వినయ్, అశోక్ పాల్గొన్నారు.

అక్షర చిట్‌ఫండ్స్ మోసానికి ఏజెంట్ బలి

- ఎఫ్‌డీ, చిట్ డబ్బులు రాక ఆత్మహత్య
- న్యాయం చేయాలంటూ చిట్‌ఫండ్స్ బాధితుల ధర్నా



ఆందోళన చేస్తున్న అక్షర చిట్ ఫండ్స్ బాధితులు



రాజు (ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో అక్షర చిట్ ఫండ్స్ మోసానికి ఆసంస్థ ఏజెంట్ బలయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు, చిట్‌ఫండ్స్ బాధితులు, పోలీసులుతెలిపినవివరాల ప్రకారం... కరీంనగర్‌జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన చింతలరాజయ్య అలియాస్ రాజు (39) అక్షర చిట్‌ఫండ్స్‌లో కొన్నేళ్లుగా ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రాజయ్య స్వంతంగా చిట్‌వేయటంతోపాటు బంధువులు, పరిచయస్థులతో చిట్స్ వేయించాడు. చిట్ డబ్బులు ఇవ్వకుండా తనకు రావాల్సిన 5లక్షల రూపాయలకు ఎక్కువ వడ్డీ చెల్లిస్తామని నమ్మబలికి చిట్‌సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకుంది.గడువుముగిసినా డబ్బులు అందకపోవడంతో రాజయ్య ఆర్థికంగా నష్టపోయాడు. 5లక్షల కోసం అక్షర చిట్‌ఫండ్స్ చుట్టూ రెండేళ్లుగా తిరిగాడు. మరోవైపు రాజయ్యద్వారా చిట్ వేసినవారికి కూడా ఆసంస్థ డబ్బులు చెల్లించకుండా మోసంచేసింది. ఈ విషయాన్ని తన భార్యకు తరచుగా చెబుతూ బాధపడేవాడు. ఇదే విషయాన్ని తలుచుకుంటూ మనోవేదనతో శుక్రవారం అర్ధ రాత్రి ఇంటివద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వేకువజామున భర్తకోసం వెతకగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. అక్షర చిట్‌ఫండ్స్ డబ్బులు చెల్లించక పోవటంతో ఆర్థికంగా నష్టపోయిన తన భర్త కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్యలావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. రాజయ్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న అక్షరచిట్‌ఫండ్స్ బాధితులు పెద్దఎత్తున కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని అక్షర చిట్‌ఫండ్స్ సంస్థపై చర్యలు తీసుకుని తమకు రావాల్సిన డబ్బులను ఇప్పించి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అక్షరచిట్‌ఫండ్స్ బాధితులు గంప జగన్, గెల్లు ఐలయ్య యాదవ్ తదితరులు మాట్లాడుతూ అక్షర చిట్‌ఫండ్స్‌సంస్థ చిట్‌గడువు ముగిసినప్పటికీ తమకు రావాల్సిన డబ్బులు చెల్లించకుండా ఒత్తిడితెచ్చిన వారికి ఖాళీ చెక్కులు ఇచ్చి రెండేళ్లయినా చెల్ల కుండా పోయాయన్నారు. ఈ క్రమంలోనే ఏజెంట్ చింతల రాజయ్య తన 5 లక్షల డిపాజిట్ డబ్బులు, చిట్ డబ్బుల కోసం ఎంత ప్రయత్నించినా రాకపోవటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని వాపోయారు.

● ప్రజల సొమ్ముతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం

అవసరాలకు ఉపయోగపడుతాయని ప్రతినెలా పొదుపు చేస్తూ అక్షర చిట్స్‌లో రిటైర్డ్‌ఉద్యోగులు, వికలాంగులు, వితంతువులు, చిరువ్యాపారులు చిట్‌వేసి బాధితులుగా మిగిలారు. మొదట చిట్ వేయించుకున్న అనంతరం వారికి డబ్బులు చెల్లించకుండా అధిక వడ్డీతో నమ్మబలికి అక్షర టౌన్‌షిప్ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకుని గడువు ముగిసినా డబ్బులు చెల్లించకుండా మోసం చేశారు. కాళ్లు అరిగేలా తిరిగినవారికి అక్షర టౌన్‌షిప్ పేరిట చెక్‌లు ఇవ్వగా అవికూడా చెల్లకుండా పోయాయి. చివరకు కొందరికి అక్షర టౌన్‌షిప్‌లో స్థలాలను 4 రెట్లకు లెక్కచేసి అంటగట్టారు. అక్షర చిట్‌ఫండ్స్ సంస్థకు తెలంగాణ వ్యాప్తంగా 65 బ్రాంచిలు ఉన్నాయి. ఒక్కో బ్రాంచిలో 50 నుంచి 60కోట్ల వరకు చిట్ సభ్యులకు బాకీ ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. కరీంనగర్‌పోలీస్‌కమిషనర్ ఆదేశాలతో కరీంనగర్ జిల్లాలోని రెండు చోట్ల 14కోట్ల రూపాయల ఆస్తులను ఇటీవల ప్రభుత్వం అటాచ్‌మెంట్‌కు ఆదేశాలు జారీచేసింది. వరంగల్, ఖమ్మం ఇతర చోట్ల ఉన్న ఆస్తులను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పేలుళ్లతో దెబ్బతింటున్న పంటలు

- డి2 కాలువ నిర్మాణ పనులతో ఇబ్బందులు పడుతున్నరైతులు
- హద్దులు దాటి పొలాల్లోకి మట్టి
- ఆందోళన వ్యక్తం చేస్తున్నరైతులు
- పట్టించుకోని అధికారులు



నాగిరెడ్డిపూర్‌లో లింక్2 కాలువ తవ్వకాలు

హద్దు దాటి పొలాల్లోకి వచ్చిన మట్టి

గంగాధర, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగిరెడ్డిపూర్ డీ-2కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న పేలుళ్లతో సమీప పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కాలువలో బండ రాళ్లను పగులగొట్టేందుకు ఉపయోగిస్తున్న భారీ పేలు ల్లతో రాళ్ల ఎగిరిపడి సమీప పంటపొలాలు ధ్వంసమవుతున్నాయి. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ వరదకాలువ నుంచి రామడుగు మండలం దత్తోజిపేట మీదుగా చొప్పదండి వరకు లింకు2 కాలువ నిర్మిస్తున్నారు. కాలువలో తీసిన మట్టిని ఒడ్డుపై పోస్తున్నారు. కాలువకు భూములిచ్చిన హద్దులు దాటి మూడు మీటర్ల వరకు రైతుల పొలాల్లో మట్టిని పోస్తుండగా తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో బండరాళ్ల పగుళ్లకు చేపట్టే పేలుళ్లతో రాళ్లు ఎగిరి వచ్చి పచ్చని పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరిపొలాలు పొట్ట దశలో ఉండగా రాళ్లు పడి కర్రలు విరిగి పోతున్నాయని రైతులు తెలిపారు. ఈ విషయంపై నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. పేలుళ్లకు పొలాలకు నీరు పెట్టా లన్నా, ఎరువులు చల్లాలన్నా భయంగా ఉందని రైతులు వాపోతున్నారు. తమ బాధను ప్రశ్నిస్తే కాలువ తవ్వే వారు బెదిరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేలుళ్ల దాటి నుంచి పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రాళ్లు పడటంతో.. భూమిని బీడుగానే వదిలేశా..



- పంజాల వేణు, రైతు, నాగిరెడ్డిపూర్


నాకు ఇక్కడ మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నా భూమి మధ్య నుంచి కాలువ తవ్వుతున్నారు. బ్లాస్టింగ్‌తో రాళ్ల పడుతుండగా భూమిని దున్నకుండానే ఒకవైపు వదిలేశా. అటువైపు నీరున్న చోట పొలం వేయగా పేళుళ్ల దాటికి పంటపొలాల్లో రాళ్ల పడి కర్రలు విరిగిపోయి నష్టపోతున్నాం. అధికారులు పట్టించుకుని పొలాలను కాపాడాలి.

రైతులకు నష్టం జరగకుండా చూస్తాం..

- రఘురాం, ఏఈ నీటిపారుదల శాఖ

నాగిరెడ్డిపూర్ డి2 కాలువ నిర్మాణంలో రైతులకు నష్టం జరగకుండా చూస్తాం. మట్టి పోస్తుండగా కొంతజారి పొలంలో పడుతుందని రైతులు నా దృష్టికి తీసువచ్చారు. పొలాల్లో పడిన మట్టిని తీసి వేయించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూస్తాం.

అల్లాడుతున్న అన్నదాతలు



చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో ఎండిపోయిన వ్యవసాయ బోరు

ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో ఎండిపోయిన వరి పైరును మేస్తున్న పశువులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వరిసాగు చేసిన రైతులకు ఆదిలోనే అరిగోస తప్పడం లేదు.

- అడుగంటిన భూగర్భ జలాలు..
- అందని సాగునీరు
- పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు

భూగర్భ జలాలు అడుగంటడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, గుంటపల్లిచెరువుతండా, దేవునిగుట్టతండా తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పంటలకు సాగు నీరు అందించేందుకు ఇటీవల కోనరావుపేట మండలం మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసినా నాలుగు రోజులకే నిలిచిపోయింది. దాంతో ఆయా గ్రామాల్లోని సుమారు 2500ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు పగుళ్లు చూపాయి. మరో 2500 ఎకరాల్లో ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో నీటి వనరులు, వ్యవసాయ బోరుబావులపై ఆధారపడి సుమారు 4వేల మంది రైతులు మొత్తం 16,850 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎంతో ఆశతో సాగు చేసిన వరి పంటలకు సాగు నీరందకపోవడంతో ఆదిలోనే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు పగుళ్లు చూపగా, మరో 2వేల ఎకరాల్లో ఎండిపోయాయి. మిగిలిన పంటలను రక్షించుకునేందుకు రేయింబవళ్లు పొలాలకు తడులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగునీటిని అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పొలమంతా పగుళ్లు చూపింది



- భూక్య మహేశ్, యువ రైతు, దేవునిగుట్టతండా

మాకున్న మూడెకరాల్లో రూ.60వేలు బాకీలు చేసి వరి పంట వేశా. ఉన్న ఒక్క బోరుతో మూడెకరాలు పారేది. ఇప్పుడు నీళ్లు అందడం లేవు. పది రోజుల నుంచి పంటంతా పగుళ్లు చూపుతోంది. మరో వారం రోజుల్లో సాగు నీరు పెడితే పంట చేతికొస్తది. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీరు అందించి పంటలను కాపాడాలే. చేసిన అప్పులు తీర్చే మార్గం కానరావడం లేదు.

15 ఏళ్లయినా వరద కాలువ పనులు పూర్తి కాలేదు

-తల్ల నరేష్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్

నాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన వరద కాలువ పనులు నిలిచి పోయాయి. 15 సంవత్సరాలు గడిచినప్పటికీ పూర్తి కాలేదు. మండలంలోని అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మామిడి తోటలకు కూడా నీరు అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వరదకాలువ పనులు పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సాగు నీరు అందేలా చూడాలి. లేదంటే పంటలపై పెట్టుబడులు పెట్టి రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారు.

పశుగ్రాసంగా మారుతున్న పంటలు..

- సాగునీరు అందక ఇబ్బందులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, చిగురుమామిడి, లంబాడిపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండుతున్నాయి. దీంతో చేసేదేం లేక రైతులు పంట పొలాలను పశుగ్రాసంగా వాడుతున్నారు. మెట్ట ప్రాంతంగా ఉన్న చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి. రేకొండ, చిన్నముల్కనూర్, ఓగులాపూర్, పీచుపల్లి గ్రామాలకు మాత్రమే సాగు నీరు వస్తోంది. ఎండలు ముదురడంతో భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు అందడం లేదు. పొలాలకు దాదాపు రెండు నెలలు సాగునీరు అందాల్సి ఉన్నది. పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన రైతులు అప్పులు తీసుకొచ్చి బావుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. మండలంలో చాలా గ్రామాలకు సాగునీరు అందడం లేదు. మామిడి తోటలకు ప్రైవేటు ట్యాంకర్ల నీరు అందిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



ట్యాంకర్‌తో మామిడి తోటకు నీరు పెడుతున్న రైతు

పశువులకు మేతగా వదిలేశా..



- భూక్య హుస్సేన్, రైతు, దేవునిగుట్టతండా

నాకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. గత రెండేళ్లలో రూ.4 లక్షల అప్పులు చేసి మూడు బోర్లు వేయించా. నీళ్లు మంచిగనే పడినయ్. బోర్లలో నీళ్లు ఉన్నాయని ఆరు ఎకరాల్లో రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టి వరి పంట వేశా. నెలకే బోర్లు ఎత్తేసినయ్. చిన్న ధారలా వస్తున్న నీళ్లతో తడులు పెడుతున్నా. మూడెకరాలకు సాగు నీరు అందక ఎండిపోయింది. పొలం ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలేశా. బోర్లు, పంట పెట్టుబడికి రూ. 5.20 లక్షల దాకా బాకీల పాలయ్యా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

- బొల్లోనిపల్లి ఎల్లవ్వ, రైతు, చిగురుమామిడి

బావుల్లో పూడిక తీయడానికి ప్రభుత్వం ఆదుకోవాలి. నాకున్న రెండు ఎకరాల భూమిలో వరి వేశాను. కనీసం ఇంకా నెలరోజులైనా నీళ్ల అవసరం ఉంది. సాగునీరు అందకపోవడంతో బావిలో పూడిక తీస్తున్నా. నీరులేక ఎండిన పంటలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించారు. కాలువ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

అందని ఎస్సారెస్పీ నీరు

మంథని/మంథనిరూరల్ : అందని సాగునీరు, మండుతున్న ఎండలతో మంథని ప్రాంతంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేసవికాలంలో ముదురుతున్న ఎండలకు తోడు సాగునీరు సైతం అందక ఇప్పటికే వందల ఎకరాల్లో వరి పొలాలు బీటలు వారాయి. యాసంగి సాగులో వివిధ గ్రామాల్లోని వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ముంచుకొస్తుంది. మరోతడికి సాగునీరు విడుదల చేయకపోతే అన్నదాతలు నిండా మునిగే ప్రమాదం ఉంది. మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ఎక్లాస్‌పూర్ వంటి ఎస్సారెస్పీ కెనాల్ చివరి ఆయకట్టు గ్రామాల్లో సాగునీరు అందక వందలాది ఎకరాల్లో వరి పంటలు బీటలువారుతున్నాయి. దాదాపు నెలరోజుల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేసిన అధికారులు ఆతర్వాత ముఖం చాటేశారు. ఓవైపు ఎండలు ముదురుతుండటం, మరోవైపు కెనాల్‌లో సాగునీరు విడుదల చేయకపోవడం, బోర్లలో సైతం సరిపడా నీరు అందడం లేదు. మరో 15 రోజులు ఇలానే కొనసాగితే పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు ఇప్పుడిప్పుడే పొట్టదశకు చేరుతున్నాయని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా మరో తడికి నీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కాకర్లపల్లి గ్రామ శివారులో బీటలువారుతున్న పంట పొలాలు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

వెల్గటూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిపల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం స్వామి వారి సుప్రభాత సేవ, స్వస్తివచనం, ఆవాహిత మండప దేవతాపూజలు నిర్వహించారు. వివిధ ఔషధ సుగంధాది స్నపనములు, బింబ శుద్ధి కార్యక్రమాలు అర్చకుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. శ్రీదేవిసహిత రుద్ర హోమము నిర్వహించిన అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మూర్తి హోమము, మూల మంత్ర హోమము, కళాహోమము నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పైడిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



తాట్లవాయిలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

- తాట్లవాయిలో..

రాయికల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్లవాయి గ్రామంలోగల సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలతో పాటు సంతాన నాగప్రతిష్ఠ, ఏకశిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రంగాచార్యులు, మురళి, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామిని భక్తులు దర్శనం చేసుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కోనరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో శనివారం పోచమ్మ తల్లి, దుర్గాంబిక దేవతల బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి పోచమ్మ, దుర్గమ్మ తల్లులకు బోనాలతో డప్పుచప్పుల మధ్య వెళ్లి నైవేద్యం చెల్లించారు. కుటుంబసభ్యులు, పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అనిల్, ఆనంద రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, దుర్గారెడ్డి, లచ్చిరెడ్డి, బాపురెడ్డి, మాజీ సర్పంచ్ జిన్నా అనిల్, ఉప సర్పంచ్ కిషన్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



దేవస్థానం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్ర సమీపంలో గల అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా రూ 1,98,319 ఆదాయం లభించింది. అలాగే 11 విదేశీ నోట్లు లభించాయి. ఈ సంవత్సరం కళ్యాణం టిక్కెట్ల ద్వారా 1,82,000, ఇతర టిక్కెట్ల ద్వారా 60,574, హుండీల ద్వారా 1,98,319 మొత్తం ఆదాయం రూ 4,40,893 లభించింది. గత ఏడాది కన్న రూ 19,206 అధికంగా ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఎండోమెంట్ జగిత్యాల ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్, జన్మంచి శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, గడ్డం భాస్కర్‌రెడ్డి, సంగి ఆనంద్, గడ్డం బోజిరెడ్డి, గంగారెడ్డి, రాజయ్య, తిరుమల సేవా గ్రూప్ కరీంనగర్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో రాజరాజేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రాజరాజేశ్వర స్వామి రథోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పురోహితులు అంగడి భువనేశ్వర్, అంగడి పరమేశ్వర్, గురులింగ మఠం వినయ్‌కుమార్, గురు లింగమఠం విక్రమ్‌ల మంత్రోచ్చరణల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మోర విజయలక్ష్మివెంకటేష్, బాలె చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, జగిత్యాల రూరల్ సీఐ చిట్యాల భూమయ్య, నామని లక్ష్మీనర్సయ్య, సుమన్, శేఖర్, ప్రసాద్, శ్రీను, వేణురావు, రాజం పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా విడుదలకు సీఎం ఆదేశం

- టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీం రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో 94 మంది బాధిత కుటుంబ సభ్యుల ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా సొమ్ము జమ చేయడానికి నిర్ణయం తీసుకోగా అందులో జగిత్యాల జిల్లాలో 31 మంది బాధిత కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందనుందన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకునేలా రూ. 5 లక్షల పరిహారం నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులకు భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రంలోకి నంబర్-1 గేట్ నుంచి అనుమతి

- ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి

కరీంనగర్ క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 3న కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లు, క్లరికల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు అంబేద్కర్ స్టేడియం గేట్ నంబర్-1 నుంచి ప్రవేశానికి అనుమతిస్తారని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ బి యాదగిరి స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేడియంలోకి ప్రవేశించిన వారు నిర్దేశించిన ప్రాంతంలో వాహనాలను పార్క్ చేసి గేట్‌నంబర్ -4 ద్వారా ఇండోర్ స్టేడియంలోకి అనుమతిస్తారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా చర్యల్లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతాపరమైన చర్యలకు అందరూ సహకరించాలని కోరారు.

బాబ్లీ గేట్లు ఎత్తివేత

- గోదావరిలోకి

0.6 టీఎంసీల నీటి విడుదల

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శనివారం అధికారులు తెరిచారు. ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని దిగువన గల గోదావరిలోకి విడుదల చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తాగునీటి అవసరాల కోసం ఒక రోజు నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో పిటీషన్లు వేయడంతో సంబంధిత ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం ప్రతీ సంవత్సరం జూలై 1వ తేదీ నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు బాబ్లీ నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తుంటారు.

వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కొవడానికి మార్చి 1న ఒక రోజు నీటిని విడుదల చేస్తారు. ఈ మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఉదయం 9.30 గంటలకు ఐదు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. 0.6 టీఎంసీల నీరు విడుదల కాగానే తిరిగి గేట్లను మూసివేస్తారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, చక్రపాణి, ప్రశాంత్, కొత్త రవి, సచిన్, విన్యాస్, సుశాంత్, రిక్కి, పలువురు బాబ్లీ ప్రాజెక్టు, ఎస్సారెస్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

ఎస్సెస్సీలో 100 శాతం ఉత్తీర్ణతకు కృషి

లోకిని శ్రీనివాస్, ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఈవో : ఎస్సెస్సీలో ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం. మార్చిలో జరిగే పరీక్షలకు మండలం నుంచి 330మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

ఆంధ్రజ్యోతి: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా?

ఎంఈవో: పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా పాఠశాలల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయా?

ఎంఈవో: మధ్యాహ్న భోజనానికి సంబంధించి నిర్వాహకులకు జనవరి దాకా డబ్బులు విడుదల చేశాం. హెల్పర్లకు రూ.3 వేల చొప్పున వేతనం ఇస్తున్నాం. పైలెట్ ప్రాజెక్ట్ కింద కంప్యూటర్లు ఏర్పాటు చేయడానికి సిరికొండ పాఠశాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించాం.

-కథలాపూర్

పారిశుధ్య పనులు చేపట్టాలి

మల్లాపూర్, మార్చి, 1 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం పురస్కరించుకొని మసీదులలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో శశికుమార్‌రెడ్డిని మైనార్టీ నాయకులు కోరుతూ వినతిపత్రం అందజే శారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను శనివారం సన్మానించిన అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు మసీద్‌లకు వెళ్లి ప్రార్థనలు చేస్తారన్నారు. గ్రామాల్లోని మసీదులు, పరిసరాలను పరిశుభ్రం చేయాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహబూబ్‌ఖాన్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై దాడి సరికాదు

రాయికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారావుపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ బీర మల్లయ్యపై దాడిచేయడం సరికాదని, ఈ దాడిని ఖండిస్తున్నామని రాయికల్ మండల యాదవ సంఘం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వాసరి మల్లేష్ యాదవ్, లాల్ చావ్లా రాజేష్ యాదవ్ విలేకరులతో శనివారం మాట్లాడుతూ దాడిచేసిన వ్యక్తులను, దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రెబ్బాసు మల్లయ్యయాదవ్, దంటిక రాజేశంయాదవ్, ఆసరి మల్లేష్ యాదవ్, గడ్డం మల్లారెడ్డి యాదవ్, కొమురయ్య యాదవ్ పాల్గొన్నారు.

‘అమరవీరుల త్యాగాలు మరువలేనివి’



జగిత్యాలలో నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



గొల్లపల్లిలో నివాళి

జగిత్యాల అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తి, త్యాగనిరతి పోరాటం మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దూమాల గంగన్న, సురుగు శ్రీనివాస్, దూమాల రాజ్‌కుమార్, మొకినపెల్లి సతీష్, బొల్లారం దివాకర్ బెజ్జంకి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం శనివారం ఘనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మాదిగ అమరవీరుల త్యాగాలు వెలకట్ట లేనివన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు చిలుముల లక్ష్మణ్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు పారుపెల్లి రాజమల్లయ్య, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరికిల్ల సతీష్, ఎంఆర్‌పీఎస్ మండల గౌరవ అధ్యక్షులు బొల్లారపు పోచయ్య, పట్టణ అధ్యక్షులు పులి ప్రేమిత్, నాయకులు రవి, నర్సయ్య, రాజం, లక్ష్మణ్, గంగాధర్, రాజనర్సు, లక్ష్మీరాజం, రమణ, రాజు, నరేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమరులైన మాదిగలకు మాదిగ జేఏసీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు పర్లపెల్లి ప్రసాద్, నరేష్ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు అమరుల చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరి స్వామి మహేష్, శ్రీనివాస్, ప్రభుదాస్, రమేష్, నర్సయ్య, ఆనందం ఉన్నారు.

●**పెగడపల్లి:** ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో జాతి లక్ష్య సాధనకై అసువులు బాసిన అమరవీరులకు పెగడపల్లి మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు జాతి లక్ష్య సాధన కోసం 30 ఏండ్లుగా అసువులు బాసిన అమరులను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు కొవ్వొత్తులతో నివాళుర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోదుంపల్లి అంజయ్య, నాయకులు కొత్తూరు బాబు, నక్క గంగాధర్, బొమ్మెన స్వామి, దీకొండ మహేందర్, తడగొండ తిరుపతి, బాలె అంజయ్య, కొత్తూరు శంకర్, రాజయ్య, భూమయ్య, బాబు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అమరులైన మాదిగ అమర వీరుల దినోత్సవంను గొల్లపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు చెవులమద్ది రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన మాదిగ అమర వీరుల త్యాగాలను మరవమన్నారు.

అమరవీరులు చేసిన త్యాగాలను, ఉద్యమస్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ముల్కాల శ్రీనివాస్, తడగొండ విజయ్, మండల శాఖ అధ్యక్షుడు చెవులమద్ది రమేష్, ఉపాధ్యక్షులు తూర్పాటి అంజి, ప్రధాన కార్యదర్శి మ్యాక స్వామి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సంతోష్, నాయకులు చెవులమద్ది హన్మండ్లు, చెవులమద్ది శ్రీనివాస్, చిర్ర దిలీప్, జెరిపోతుల నరేష, మద్దూరి నవీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కొడిమ్యాలలో నివాళి అర్పిస్తున్న నాయకులు

‘ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత’



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నలువాల తిరుపతి

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతను అధిగమించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నలువాల తిరుపతి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మాట్లాడుతూ ప్రధానిమోదీ నాయకత్వంలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా అన్ని రాష్ట్రాలకు అవసరం అయిన యూరియాను సరఫరా చేస్తుందని, యూరియా కొరత పూర్తి అవాస్తవం అన్నారు. పంటల సాగుపై అవగాహన లేకపోవడం, సాగు విస్తీర్ణం అంచనా వేయడంలో అధికార యంత్రాంగంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ఆలోచన చేసుంటే రైతులకు ప్రస్తుతం యూరియా కష్టాలు తప్పేవన్నారు. దేశంలో యూరియా రేకులు నిర్ణీత తేదీలలో వాటి ఉద్దేశించిన గమ్యస్థానాలకు చేరుకుంటాయన్నారు. యూరియా సరఫరాకు సంబంధించిన వివరాలు కేంద్రం వద్ద ఉన్నాయన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందించ డంలో రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ పర్యవేక్షణ లోపమన్నారు. 45కిలోల యూరియా బ్యాగు గరిష్ట రిటేల్ ధర రూ. 266కు అమ్ముతుండగా, 50కిలోల డీఏపీ బ్యాగ్ రైతులకు రూ.1350కే అందిస్తుందన్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ కేంద్ర ప్రభుత్వం రైతుకు ఒక్కో బ్యాగుకు రూ.2099 సబ్సిడీలు మంజూరు చేస్తుందన్నారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. యూరియా అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

సౌదీలో గుండెపోటుతో రేగుంట వాసి మృతి

మల్లాపూర్, మార్చి, 1 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన కర్నె గణేష్(55) అనే గల్ఫ్ కార్మికుడు సౌదీలో గుండెపోటుతో మృతి చెందినట్లు శనివారం కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కర్నె గణేష్ జీవనోపాధి కోసం కొంత కాలం నుంచి గల్ఫ్ వెళ్తున్నాడు. ఆరు నెలల క్రితమే ఇంటికి వచ్చి తిరిగి సౌదీ వెళ్లాడు. కాగా రెండు రోజుల క్రితం చాతీ నొప్పిగా ఉందని సౌదీలోని రూమ్‌లో ఉన్న స్నేహితులతో తెలిపాడన్నారు. అనంతరం స్నాం చేసి బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చిన ఆకస్మాత్తుగా చాతినొప్పిగా ఉందని పడిపోయాడన్నారు. వెంటనే స్నేహితులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లలోపే మృతి చెందినట్లు స్నేహితులు తెలిపినట్లు వారు తెలిపారు. మృతుడికి చూపు సరిగా లేని భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పేద కుటుంబానికి చెందిన కర్ణ గణేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ర్యాంకు దక్కేనా..?

(5వ పేజీ తరువాయి)

రీ యూజ్, రీ సైకిల్ థీమ్‌తో నడుస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించి మూడు సర్వేల్లో మూడు దశలు పూర్తయ్యాయి. నాలుగో దశలో ఈ మార్పులు చేశారు. అమలు విధి విధానాల్లోనూ కీలక మార్పులు చేశారు. జనాభా ప్రాతిపదికన నిబంధనలు, పది విభాగా ల్లో ఇండికేటర్స్ సరళీకరణ, కొత్తగా సూపర్ స్వచ్ఛ్ లీగ్ పట్టణాలు, కొన్ని అంశాలకు కొత్త ఇండికేటర్స్ కేటాయించారు. పాఠశాలలు, జన సామర్థ్యం ఉండే ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలపై దృష్టి పెట్టారు. స్వచ్ఛతకు సంబంధించి పాఠశాలలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, స్వచ్ఛతమ్ పోర్టల్ పొందుపరిచిన వివరాలు, క్షేత్ర స్థాయి పరిస్థితు లకు భిన్నంగా ఉంటే మైనస్ మార్కులు వేయనున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నాం

-సోమిడి శివ, మెప్మా సీవో, మెట్‌పల్లి



మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నాం. ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో మెట్‌పల్లి మున్సిపాలిటీకి ఆశించిన ర్యాంకు రావడానికి అనుగుణంగా ప్రజలు స్పందిస్తున్నారు.

సర్వే కొనసాగుతోంది

-దుర్గపు శ్రీనివాస్ గౌడ్, మెప్మా ఏవో



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వివిధ రకాల సేవలపై సర్వే కొనసాగుతోంది. సిబ్బంది ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నాం. జిల్లాలోని మున్సిపాలిటీలు మంచి మార్కులు సాధిస్తాయనుకుంటున్నాం.

సాగు నీరందక ఎండుతున్న పంటలు



ఎండపల్లిలో ఎండిన పొలంలో పశువులను మేపుతున్న రైతు

ఎండపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎండపల్లి మండల కేంద్రంలో సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయి. ఎండపల్లి గ్రామానికి చెందిన సబ్బ స్వామి అనే కౌలు రైతు ఐదు ఎకరాల భూమిని కౌలుకు చేస్తున్నాడు. ఐదు ఎకరాల పంట సాగుకు ఇప్పటి వరకు 80 వేల రూపాయలు పెట్టుబడి పెట్టినట్లు పేర్కొన్నాడు. వరి పొట్ట దశకు వచ్చే సరికి సాగు నీరందక ఎండిపోయిందని కౌలు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. చివరకు పశువులకు మేతగా మారిందని రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరుతున్నాడు.

గోదాంను సందర్శించిన జిల్లా సహకార అధికారి

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ళ ఎరువుల గోదాంను జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా బస్తాల కొరత వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి నేరెళ్ళ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు జాజాల రమేష్ తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన రైతుల ఇబ్బందులు లేకుండా యూరియా బస్తాలు అందించేల చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరి రాజేష్, ఏఈవో నవ్య, సహకార సిబ్బంది, రైతులు, తదితరులు ఉన్నారు.

కవులకు ప్రోత్సాహం అందించాలి

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నవ కవులకు తగిన ప్రోత్సాహం అందాల్సిన అవసరముందని జగిత్యాల కళాశ్రీ సాహితీ వేదిక అధినేత గుండేటి రాజు అన్నారు. శనివారం ‘కవి ఇంటికి కళా శ్రీ’ అను కార్యక్రమంలో భాగంగా కళాశ్రీ సాహితీ వేదిక ఆధ్వర్యంలో కవి కందూరి వెంకటేశ్వర్లుకు పురస్కారం అందజేశారు. కళాశ్రీ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నవ కవులకు పురస్కారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశ్రీ సాహితీ సంస్థ నిర్వాహకులు చిందం సునీత, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, గంధ్ర లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



పెద్దాపూర్ గురుకుల విద్యార్థికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ మాధవీలత సూచించారు. పెద్దాపూర్ గ్రామశివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురు కుల పాఠశాల, కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నతస్థానంలో ఉన్నారని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. గురుకులంలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలలోని 10వ తరగతిలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థికి రూ. 10వేల నగదు, విద్యార్థులకు పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నలభై సంవత్సరాల చరిత్ర కలిగిన గురుకుల పాఠశాలలో చదువుకున్న పలువురు విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో రమణ, పరశురాములు, సిరిపురం శ్రీనివాస్, అల్లూరి మహేందర్‌రెడ్డి, ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన

సారంగాపూర్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పోతారం మహాలక్ష్మి ఆలయంలో శనివారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య ఆచార్యులు, రాజశేఖర్ ఆచార్యుల సమక్షంలో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయంలో అన్నదానం చేశారు. ఆదివారం రోజున జాతర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కొత్తపె ల్లి రాజేశం, ఉపాధ్యక్షులు పంతకాని లక్ష్మణ్, ఐత అశ్విన్, కంచర్ల రమేష్, కిరణ్‌రావు, గాడిపెల్లి వెంకటేష్, కంచర్ల నరేష్, సింగం సత్తయ్య, మహిళ లు, గ్రామ ప్రముకులు పాల్గొన్నా.

ఇసుక డంప్ స్వాధీనం

కొడిమ్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరాపూర్-నర్సింహులపల్లి గ్రామాల శివారులో శనివారం 16 ట్రిప్పుల ఇసుక డంపును మైనింగ్ ఏడీ జయసింగ్ ఆధ్వర్యంలో సంబంధిత విజిలెన్స్ అధికారులు శనివారం పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో వజిలెన్స్ టీం మైనింగ్ ఆర్‌ఐ సుదర్శన్, రెవెన్యూ ఆర్‌ఐ ఆర్‌ఐ కరుణాకర్, హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కొడిమ్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి బి నారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కె వేణు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు



ధర్మపురిలో ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు



కోరుట్లలో నమూనాలను తిలకిస్తున్న అధికారులు

జగిత్యాల అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని గౌతం మోడల్ పాఠశాలలో శనివారం సైన్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హాజరయి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పిల్లల సృజనాత్మకతను వెలికితీయడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి పిల్లల్లోని ప్రతిభను వెలికి తీయాలని ఉపాధ్యాయులను ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ టి. అరుందతి, ఇంచార్జి సృజన, హేమలత, గీతాంజలి పాల్గొన్నారు.

●**కోరుట్ల** : వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యత పెంపొందుతుందని వైద్యులు స్వీతి అనూఫ్-అనూఫ్‌రావు, మండల విద్యాధికారి నరేశంలు అన్నారు. శనివారం పట్టణంలోని గౌతమ్ మాడల్ స్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫేర్‌ను వైద్యులు స్వీతి అనూఫ్-అనూఫ్ రావు, మండల విద్యాధికారి నరేశంతో కలిసి ప్రారంభించి సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో తయారు చేసిన అంశాలను తెలుసుకొని విద్యార్థులను అభినందించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, డీన్ నర్సింహరాజులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** సైన్స్ డే పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన సైన్స్ మాడల్స్‌ను ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన సైన్స్ మాడల్స్ ఎంతో దోహదపడుతాయని అన్నారు. అనంతరం విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి, బుగ్గారం ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్, ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్ గట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి డాక్టరేట్

కొడిమ్యాల, మార్చి1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నమిలికొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏనుగు మల్లారెడ్డి శనివారం డిల్లీలోని కేంబ్రిడ్జ్ డీజిటల్ యూనివర్సిటీ వారితో సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. సామాజిక రంగంలో చేసిన అపారమైన సేవలను గుర్తించి మల్లారెడ్డికి ఈ అవార్డు అందించినట్లు యూనివర్సిటీ వారు ప్రకటించారు. దశాబ్దంన్నర కాంగా మండలంలోని నమిలికొండ ప్రాథమిక పాఠశాలలో మౌళిక వసతుల ఏర్పాటుకు స్వంత ఖర్చులతో కృషి చేస్తున్నారు.

సన్మానం

మెట్‌పల్లిటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన ప్రదీప్‌కుమార్ జిల్లా ఎల్పీజీ డిస్ట్రీబ్యుటర్‌ల సంఘ అధ్యక్షుడిగా నియామకం కాగా శనివారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు మైలారపు లింబాద్రి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మైలారపు రాంబాబు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన ఉండాలి



కంపోస్టును పరిశీలిస్తున్న అధికారులు

కోరుట్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన ఉండాలని రాష్ట్ర కంపోస్టు డెవలప్‌మెంట్ అధికారి హేమలత అన్నారు. కోరుట్ల మున్సిపల్‌ను వివిధ మున్సిపల్ కమిషనర్లతో కలిసి సందర్శించారు. కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టీకే శ్రీదేవి ఆదేశాల మేరకు వర్మీ కంపోస్టు తయారీ చేసే విధానం, వ్యర్థాల నివారణపై రాష్ట్ర కంపోస్టు డెవలప్‌మెంట్ అధికారి హేమలత ఏడు మున్సిపాల్టీలకు చెందిన కమీషనర్లుతో సందర్శిం చారు. పట్టణంలో కంపోస్టు తయారు చేసే విధానంపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ మున్సిపల్‌ల నుండి వచ్చిన కమిషనర్లుకు, శానిటేషన్ విభాగం అధికారులకు కపోస్టు విధానంపై అవగాహన కల్పించారు. కోరుట్ల మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యర్థాల నివారణను పరిశీలించి కంపోస్టు తయారి విధానంపై సంబదింత సిబ్బందిని వివారలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ కమీషనర్ తిరుపతితో పాటు వివిధ మున్సిపల్ కమీషనర్ల్, ఏడీలు, ఏఈలు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జన ఔషధి పరియోజనపై అవగాహన ర్యాలీ

జగిత్యాల అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జెనరిక్ మందుల షాపుల యాజమానులు ప్రధానమంత్రి జన ఔషధి పరియోజనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు జెనరిక్ మందులు వినియోగించేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన బ్రాండెడ్ మందులను సరసమైన ధరలకు అందించడానికి ప్రధానమంత్రి జనఔషధి కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో సత్యనారాయణ, సీహెచ్‌వో శ్రీధర్, హెచ్‌ఈ వోలు రాం కుమార్, శ్రీధర్, రాజేశం, హెల్త్ ఎడ్యుకేటర్స్ భూమేశ్వర్, శంకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైనా గ్రామానికి చెందిన సాయిని రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్ రూ. 2,500 నగదు, 25 కిలోల బియ్యం శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిలివేరి సత్యానారాయణ, అల్లె రమేష్, బండారి మహేష్, దుర్గం లచ్చన్న, సాయిని బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

పెగడపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించినట్లు పెగడపల్లి ఎస్‌ఐ సీహెచ్ రవికిరణ్ శనివారం తెలిపారు. దోమలకుంట గ్రామానికి చెందిన తొట్ల మల్లయ్య అనే వ్యక్తి రెండునెలల క్రితం తన మొబైల్ ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెతికి పట్టుకుని బాధితునికి అప్పగించినట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు.

కుల సంఘాల అభివృద్ధికి కృషి

మెట్‌పల్లిటౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కుల సంఘాల అభ్యున్నతికి తనవంతు సహకారం అందిస్తానని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ రఘు అన్నారు. నూతనంగా నియామకమైన గౌడ సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్‌గౌడ్‌ను, ఉపాధ్యక్షులు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్‌ను, కార్యవర్గంను శనివారం సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన యాదగిరిబాబును కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.